

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -178 | పేజీలు - 8 | వెల - 03/- | బుధవారం 7 అక్టోబర్ 2026

సమన్వయంతో లోకల్ ఫైట్‌కు

'స్థానికం'పై చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయం?

2024 నాటి సర్దుబాటుతో సంబంధం లేదు

ప్రస్తుత బలాబలాల ఆధారంగా పోటీ

ఉండవల్లిలో గంటకుపైగా చర్చలు

కూటమి ఐక్యతకు దెబ్బ లేకుండామందుకు వెళ్దామన్న బాబు

జనసేన ఆశిస్తున్న సీట్ల జాబితా అందజేసిన పవన్

అన్ని స్థాయిల్లో చర్చించాక తుది నిర్ణయం తీసుకుందామన్న సీఎం



అమరావతి, అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
కూటమిలోని మూడు పార్టీల నడుమ 2024 సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన సర్దుబాటుతో సంబంధం లేకుండా తాజా బలాబలాల ఆధారంగా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో మూడు పార్టీల కార్యకర్తలు, నాయకుల మనోభావాలను గౌరవిస్తూనే. మిగతాది 2లో...

ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు

నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం

గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి

ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం

ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు



అమరావతి, అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల మిగతాది 2లో...

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి


ఈసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు ఇండియా కూటమి నేతల యత్నం

రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను అడ్డుకున్న పోలీసులు

భేటీకి తమను ఎవరూ సంప్రదించలేదని స్పష్టం చేసిన ఎన్నికల సంఘం



న్యూ ఢిల్లీ అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి నేతలు చేపట్టిన నిరసన ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే, తమతో సమావేశం కోసం ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ముందస్తు అభ్యర్థన రాలేదనిమిగతాది 2లో...



మంచుగడ్డతో విశ్వ రహస్యాల ఛేదన

భౌతిక శాస్త్రంలో ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు నోబెల్..

దక్షిణ ధ్రువంలో ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ నిర్మాణంలో కీలక పాత్ర

అతి శక్తిమంతమైన న్యూట్రినోలను గుర్తించినందుకు ఈ గౌరవం

హాల్జెన్ దూరదృష్టి ఖగోళ శాస్త్రంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని కమిటీ ప్రశంస

న్యూ ఢిల్లీ అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
ఈ ఏడాదికి (2026) గాను భౌతిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ మిగతాది 2లో...

పాక్ గూఢచర్య ముఠా గుట్టురట్టు

నెట్‌వర్క్‌ను ఛేదించిన ఏపీ ఇంటెలిజెన్స్.. ఇద్దరి అరెస్ట్

విశాఖ నేవీ స్థావరాల సమాచారమే లక్ష్యంగా కుట్ర

13 మంది నేవీ సిబ్బంది సహా 18 మందిపై నిఘా

విశాఖ, కోయంబత్తూర్‌లలో ఇద్దరిని అరెస్ట్ చేసిన అధికారులు

డబ్బు కోసం రహస్య సమాచారం చేరవేసినట్లు ఆరోపణలు



సుప్రీంకోర్టులో గెలుస్తాం

స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా..

: రామ్మోహన్ నాయుడు

ఢిల్లీలో న్యాయ నిపుణులతో టీడీపీ నేతల చర్చలు

జరిపిన బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న



న్యూ ఢిల్లీ అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీంకోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టునుమిగతాది 2లో...

ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

ఎకో టూరిజం ప్రాజెక్టులతో కొత్త అనుభూతి



ప్రకృతితో అనుసంధానం ద్వారా ప్రజలకు అనుభూతి, గిరిజన యువతకు ఉపాధి

నగర వనాల్లో స్వచ్ఛమైన, ఆహ్లాదకర వాతావరణం

అన్ని ప్రాంతాలను కలిపేలా పర్యాటక అభివృద్ధి

రాష్ట్రంలోని 6 నగరవనాలను వర్చువల్‌గా ప్రారంభించిన పవన్ కళ్యాణ్

అమరావతి, అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
రాష్ట్ర ప్రజలను ప్రకృతిలో మమేకం చేసి, వారికి మరిచిపోని మధురానుభూతులను ఇవ్వడంతో పాటు, గిరిజనులకు ఎకో టూరిజం జీవనోపాధులు మెరుగుపర్చడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంత అందాల నుంచి కోటప్పకొండ ఆధ్యాత్మిక ప్రయాణం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పర్యాటక మిగతాది 2లో...

ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు

కాంట్రాక్టు నుంచి రెగ్యులరైజ్ అయ్యాక వెలుగులోకి బాగోతం

మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై కొనసాగుతున్న విచారణ



కేసీఆర్ కుటుంబానికి నోటీసులు!

సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్టు గుర్తింపు

రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు

అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం

జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచన

హైదరాబాద్ అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).
సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మిగతాది 2లో...



వాయుసేన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఉన్న దీక్షిత్‌కు పదోన్నతి

అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న అమర్ ప్రీత్ సింగ్

3,500 గంటలకు పైగా ఫైటర్ జెట్ నడిపిన అనుభవం

త్రివిధ దళాల సమన్వయం, ఆధునికీకరణపై దృష్టి



మిగతా2లో...

ఎకో టూరిజం ప్రాజెక్టులతో కొత్త అనుభూతి

(మొదటి పేజీ తరువాయి)

కళను తీసుకొచ్చేలా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితమైన 6 నగరవనాలను ఉప ముఖ్యమంత్రి మంగళవారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగర వన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 నగరవనాలుంటే, ఇప్పుడు ప్రారంభించిన ఆరు నగరవనాలతో కలిపి 25 నగరవనాలు రాష్ట్రంలో ఏర్పడతాయి. 305 హెక్టార్లలో, రూ.13 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా, ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే మార్గంగా ఉంటాయి. నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ లు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, జిమ్ పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో, స్వచ్ఛమైన అందాలతో నగరవనాలు ఆరోగ్యం, ఆహ్లాదం, ప్రకృతి అవగాహన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. బాపట్ల, చీరాల తీర ప్రాంత పర్యాటక వనాలుగా ఉంటే, కోటప్పకొండ ఆధ్యాత్మిక సువాసనలతో విరాజిల్లుతుంది. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేసే నగరవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రకృతికి దగ్గరయితే, ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతి అర్థమైతే, పరిరక్షణ



బాధ్యత పెరుగుతుంది. ఇది ప్రకృతి నియమం.
రాష్ట్రంలో ఎకో టూరిజం పెరగడం వల్ల గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెలిగోడు జంగిల్ సఫారీతో సరికొత్త అనుభూతులు లభిస్తాయి. మారేడుమిల్లి ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ ద్వారా తూర్పు కనుమల అటవీ అందాలను, ప్రకృతి పరిమళాలను ప్రజలకు చేరువ చేస్తాం. గిరిజన సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తాం. దీనివల్ల గిరిజనుల జీవన విధానంలో మంచి మార్పులు వస్తాయని సత్సంకల్పంతో పని చేస్తున్నాం. ప్రకృతిని ప్రేమించాలి.. భావితరాలకు బహుమతిగా ఇవ్వాలనేది మా సంకల్పం. దీనికి కట్టుబడి పనిచేస్తాం. దీనికి ప్రజలు తమవంతుగా సహకరించాలి" అన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ రూపొందించిన వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రీ టాన్స్ లోకేషన్ మాన్యూవల్ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రివర్యులు ఆవిష్కరించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దేశంతోనే మొదటిసారి "ఈకోలిప్టస్ పల్ప్ ఉడ్ ప్లాంటేషన్" విభాగంలో అనుసరిస్తున్న సుస్థిర నిర్వహణ పద్ధతులకు గుర్తింపుగా సాధించిన ప్రమాణ్ సర్టిఫికేట్ ను డిప్యూటీ సీఎం గారి చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదల Naga Babu , వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రంపచోడవరం ఎమ్మెల్యే మతి మిరియాల శిరిష, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, అటవీ, పర్యావరణ శాఖ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, సీఈవో ఏపీ గ్రీన్ బీఎన్ఎన్ మూర్తి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎకో టూరిజం ఈడీ మతి నందిని సలారియా, అటవీశాఖ ఐటీ సలహాదారుల పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు

హైదరాబాద్ అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).

తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.
వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు.ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పాక్ గూఢచర్య ముఠా గుట్టురట్టు

విశాఖపట్నంఅక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).

భారత నావికాదళానికి చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం ఛేదించింది. "ఆపరేషన్ ఫైర్‌వాల్-2026" పేరుతో చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా విశాఖపట్నంలోని కీలక రక్షణ స్థావరాల సమాచారాన్ని శత్రు దేశానికి చేరవేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.ఈ కేసులో మొత్తం 18 మంది అనుమానితులపై నిఘా పెట్టినట్లు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. వీరిలో 13 మంది నేవీ సిబ్బంది కూడా ఉండటం సంచలనం సృష్టిస్తోంది. 12 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక సహా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సోదాలు జరిపాయి. నిందితులు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ చానెళ్ల ద్వారా సంప్రదింపులు జరిపినట్లు ఆధారాలు సేకరించారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలను విశ్లేషిస్తున్నారు.అరెస్టయిన వారిలో విశాఖపట్నానికి చెందిన కాంట్రాక్టు డ్రైవర్ అన్నం సాయి వరప్రసాద్ ఒకరు. ఇతను నేవీ, ఇతర రక్షణ స్థావరాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని డబ్బు కోసం పాక్ ఏజెంట్‌కు చేరవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతనికి అక్టోబర్ 14 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ప్రస్తుతం విశాఖ జిల్లా జైలులో ఉన్నాడు.
రెండో నిందితుడు కోయంబత్తూర్‌కు చెందిన నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీ. పాకిస్థాన్ ఏజెంట్‌కు సంబంధించిన వాట్సాప్ ఖాతాను యాక్టివేట్ చేయడానికి అవసరమైన ఓటీపీని ఇతను షేర్ చేసినట్లు గుర్తించారు. ట్రాన్సిట్ వారెంట్‌పై అతన్ని విజయవాడకు తరలించారు. ఇతనికి కూడా అక్టోబర్ 14 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించగా, విజయవాడ జిల్లా జైలులో ఉంచారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. మిగిలిన అనుమానితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.

మంచుగడ్డతో విశ్వ రహస్యాల ఛేదన

(మొదటి పేజీ తరువాయి)

గెలుచుకున్నారు. దక్షిణ ధ్రువంలో 'ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ' ఏర్పాటుకు ఆయన చేసిన విశేష కృషి, అత్యంత శక్తిమంతమైన ఖగోళ న్యూట్రినోలను కనుగొన్నందుకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది.

ఏమిటీ న్యూట్రినోలు?

న్యూట్రినోలు అనేవి విశ్వమంతా వ్యాపించి ఉండే అతి సూక్ష్మమైన కణాలు. ఇవి మనల్ని, మన భూమిని కూడా దాటుకొని నిరంతరం ప్రయాణిస్తూనే ఉంటాయి. కానీ, వీటిని గుర్తించడం చాలా కష్టం. ఎందుకంటే ఇవి దేనితోనూ సులభంగా చర్య జరపవు. అరుదుగా ఏదైనా అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు మాత్రమే వీటి ఉనికిని పసిగట్టడం సాధ్యమవుతుంది. విశ్వంలో జరిగే అతి శక్తిమంతమైన ప్రక్రియల నుంచి ఈ న్యూట్రినోలు పుడతాయి. ఇతర కణాల్లా కాకుండా, న్యూట్రినోలు తమ దిశను మార్చుకోకుండా, శక్తిని కోల్పోకుండా నేరుగా మనల్ని చేరతాయి. అందువల్ల, విశ్వంలోని రహస్యాలను ఛేదించడానికి ఇవి కీలక సమాచారాన్ని అందిస్తాయి.
దక్షిణ ధ్రువంలోని స్వచ్ఛమైన మంచును ఉపయోగించి న్యూట్రినోలను పట్టుకోవచ్చనే అద్భుతమైన ఆలోచనను ఫ్రాన్సిస్ హాల్జెన్ తొలిసారిగా 1988లో ప్రతిపాదించారు. మంచులో న్యూట్రినో అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు ఒక కాంతి వెలువడుతుందని, ఆ కాంతిని సెన్సార్ల ద్వారా గుర్తించవచ్చని ఆయన భావించారు. భూకంపాలు లేని స్థిరమైన భౌగోళిక ప్రాంతం కావడం, ఇతర జోక్యాలు తక్కువగా ఉండటంతో దక్షిణ ధ్రువం ఈ ప్రయోగానికి అత్యంత అనువైనదిగా నిరూపితమైంది. కొద్దికాలంలోనే ఆయన ఆలోచనకు ఇతర శాస్త్రవేత్తల మద్దతు లభించింది. అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోలు చాలా అరుదుగా కనిపిస్తాయి కాబట్టి, వాటిని గుర్తించడానికి భారీ పరిమాణంలో మంచు అవసరం. ఈ క్రమంలోనే ఒక క్యూబిక్ కిలోమీటరు విస్తీర్ణంలో సెన్సార్లతో కూడిన 'ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ'ని 2011లో పూర్తిచేశారు. కొద్ది కాలంలోనే పరిశోధకులు తొలిసారిగా అధిక శక్తి కలిగిన న్యూట్రినోలను గుర్తించారు. సౌర వ్యవస్థకు ఆవల నుంచి వస్తున్న న్యూట్రినోల ఆవిష్కరణను ప్రకటించి, విశ్వంలోని న్యూట్రినో మూలాలను వెతికే అన్వేషణకు మార్గం సుగమం చేశారు."ఫ్రాన్సిస్ హాల్జెన్ ఒక అంతర్జాతీయ బృందానికి నాయకత్వం వహించి మనకు ఒక అద్భుతమైన పరికరాన్ని అందించారు. ఆయన పట్టుదల, శాస్త్రీయ దార్శనికత ఖగోళ శాస్త్రంలో ఒక కొత్త శకానికి దారితీశాయి" అని నోబెల్ కమిటీ ఫర్ ఫిజిక్స్ చైర్మన్ మార్క్ పియర్స్ ప్రశంసించారు. ఐస్‌క్యూబ్ ద్వారా లభించే సమాచారం విశ్వంలోని భయంకరమైన ప్రక్రియల గురించి కొత్త విషయాలను వెల్లడించడమే కాకుండా, మునుపెన్నడూ తెలియని ఖగోళ రహస్యాలను కూడా బహిర్గతం చేయగలదని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



పార్లమెంట్ స్ట్రీట్ నుంచి ఈసీ కార్యాలయం వైపు 'ఇండియా' కూటమి నేతలు నిరసన ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలు పాల్గొన్నారు. వారిని ఆకాశవాణి భవన్, నీతి ఆయోగ్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ పోలీసు బారికేడ్లను దాటుకుని ఆల్ ఇండియా రేడియో ప్రాంగణంలోకి వెళ్లి, అక్కడే సుమారు కొన్ని గంటల పాటు గడిపారు.ఈ పరిణామాలపై ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు. మంగళవారం తమతో భేటీ కోసం ఏ రాజకీయ పార్టీ కూడా ముందుగా అపాయింట్‌మెంట్ కోరలేదని వారు తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని బృందం వినతిపత్రం సమర్పించేందుకు వస్తున్నట్లు సాయంత్రం నాలుగు గంటల సమయంలో సమాచారం అందిందని, అయితే నిబంధనల ప్రకారం అధికారికంగా ఎలాంటి ముందస్తు అభ్యర్థన అందలేదని ఈసీ వర్గాలు వెల్లడించాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయని, ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఈ నిరసన చేపట్టాయి. ర్యాలీని అడ్డుకున్న పోలీసులు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నారు.

సమన్వయంతో లోకల్ ఫైట్‌కు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ఐక్యతకు భంగం కలగకుండా సీట్ల సర్దుబాటుపై ముందుకెళ్దామని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటే ప్రధాన అజెండాగా వీరిద్దరి నడుమ గంటకుపైగా చర్చలు సాగాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చారు. ఆయనకు మంత్రి లోకేశ్ స్వాగతం పలికారు. ఆత్మీయంగా కౌగిలించుకుని.. కరచాలనం చేసి ఇంట్లోకి తీసుకెళ్లారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం ఏకాంతంగా గంటకుపైగా చర్చించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నడుమ సీట్ల పంపిణీపైనే ప్రధానంగా చర్చ జరిగింది. తొలి నుంచీ బీసీల పార్టీగా ఉన్న టీడీపీ స్థానిక ఎన్నికల్లో వారికి 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుందని, సుప్రీంకోర్టులో దీనిపై తీర్పు వెలువడిన వెంటనే స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని చంద్రబాబు పవన్‌కు తెలిపారు. ఈ సందర్భంగా.. జనసేన ఆశిస్తున్న స్థానాల జాబితాను పవన్ ఆయనకు అందజేశారు. వీటిపై ఎన్‌డీఏ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశంలోనూ చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని ఉభయులూ నిర్ణయించారు. పవన్ 2 గంటలపాటు సీఎం నివాసంలో ఉన్నారు.

ఎమ్మెల్యేలున్న చోట..ఎక్కువ సీట్లు కోరుతున్న జనసేన! వేరే ప్రాంతాల్లో అడుగుతున్న బీజేపీ!!

పవన్ కల్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి రామానాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కూటమి సమన్వయ కమిటీ సమావేశాల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయుల్లో జరిగిన సమన్వయ కమిటీ సమావేశాల సారాంశాన్ని వారిద్దరూ ఆయనకు వివరించారు. 'జనసేన ఎమ్మెల్యేలు ఉన్న చోట చైర్మన్ పదవితో పాటు 50 శాతం కార్పొరేటర్లు/కౌన్సిలర్ల స్థానాలను ఆ పార్టీ ఆశిస్తోంది. దీనివల్ల ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ సమన్వయంతో పనిచేసే వెసులుబాటు ఉంటుందని భావిస్తోంది. అయితే బీజేపీ ఆలోచన వేరుగా ఉంది. తమ ఎమ్మెల్యే ఉన్న చోట నాయకత్వం ఎలాగూ ఉంది కాబట్టి వేరే చోట చైర్మన్, కార్పొరేటర్ల స్థానాలు కేటాయించాలన్న ప్రతిపాదన తెచ్చింది. తద్వారా ఇతర ప్రాంతాల్లోనూ తమ పార్టీ స్థానిక నాయకత్వం బలపడే అవకాశం ఏర్పడుతుందన్నది ఆ పార్టీ ఆలోచనగా ఉంది' అని పల్లా, నిమ్మల వివరించారు. రిజర్వేషన్లు ఇంకా ఖరారు కానందున.. అవి తేలాకే అభ్యర్థుల పోటీపై తుది నిర్ణయం తీసుకోగలమన్నారు. 2024లో సాధించిన ఓట్ల కంటే ఎక్కువగా స్థానిక ఎన్నికల్లో సాధించాలని సీఎం నేతలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో కూటమి నేతలు ఐక్యంగా ఉండి అన్ని స్థానాలూ కైవసం చేసుకోవాలని సూచించారు. పవన్ కల్యాణ్ తనకు అందజేసిన జనసేన స్థానిక అభ్యర్థుల జాబితాపై కసరత్తు చేయాలని పల్లా, నిమ్మలను ఆయన ఆదేశించారు.

రాష్ట్ర సమన్వయ కమిటీ జూమ్ కాన్ఫరెన్స్

కూటమి పార్టీల రాష్ట్ర సమన్వయ కమిటీ మంగళవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. టీడీపీ నుంచి పల్లా, నిమ్మల.. జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. రిజర్వేషన్లు ఖరారయ్యాక అభ్యర్థుల జాబితాలపై నిర్ణయానికి వద్దామని మనోహర్ సూచించారు. అయితే జనసేన బలంగా ఉందనుకుంటున్న స్థానాల వివరాలను ఇవ్వాలని పల్లా కోరారు. గురువారం మరోసారి భేటీ అవ్వాలని నిర్ణయించారు.

ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు.సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు.మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు.
రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

సుప్రీంకోర్టులో గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయించిందని తెలిపారు. ఢిల్లీలో న్యాయనిపుణులతో అచ్చెన్నాయుడు, అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, రామ్మోహన్ నాయుడు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని ప్రశ్నించారు. వారికి రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 34 శాతం కోటాను పునరుద్ధరిస్తే బీసీలకు సుమారు 16,800 పదవులు దక్కుతాయని... ఇది రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాలు బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే మార్గాలను అన్వేషిస్తున్నాయని, ప్రభుత్వం కూడా సమస్యను జఠిలం చేయకుండా పరిష్కారం కోసం చూస్తోందని వివరించారు.మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని సవరించకుండానే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. దీనివల్ల వేలాది మంది బీసీ నేతలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 1987లో టీడీపీనే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిందని, ఆ తర్వాత చంద్రబాబు హయాంలో దాన్ని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు

వాయుసేన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

న్యూ ఢిల్లీ అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).

భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు.
నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్-2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు. ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు.
వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.
ప్రస్తుతం భారత వాయుసేన ఆధునికీకరణ, యుద్ధ విమానాల సంఖ్య పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో ఎయిర్ డిఫెన్స్, మానవరహిత యుద్ధ సామర్థ్యాల పెంపుదల, త్రివిధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. త్రివిధ దళాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న దీక్షిత్ నియామకం, ఈ లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

స్కూల్ చైర్మన్లకు ఘన సన్మానం



గుత్తి అక్టోబర్ 06 (రిపబ్లిక్ న్యూస్):పట్టణంలోని ఆర్అండ్బీ బంగ్లాలో ఇటీవల గుత్తి పట్టణ, మండల పరిధిలోని పాఠశాలల స్కూల్ చైర్మన్లుగా ఎన్నికైన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, గుత్తిపామిడి ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఎన్నికైన చైర్మన్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, ఎన్టీఆర్ చిత్రపటాలను అందజేశారు.ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ స్కూల్ చైర్మన్లుగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి మంచి పేరు తీసుకురావాలని, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బద్రివలి, పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, మండల అధ్యక్షుడు లక్ష్మీరంగయ్య, రవితేజ, నారాయణస్వామి, శ్రీనివాసులు, రమేష్, రాజా, రంగారెడ్డి, సుధాకర్, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, మారుతీ ప్రసాద్, మండల నాగరాజు, లాయర్ శేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్కూల్ చైర్మన్లు పాల్గొన్నారు

ఎమ్మిగనూరు నూతన డీఎస్పీకి
సమతా సైనిక్ దళ్ స్వాగతం



ఎమ్మిగనూరు, అక్టోబర్, 6,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)ఎమ్మిగనూరు నూతన డీఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను సమతా సైనిక్ దళ్ రాయలసీమ అధ్యక్షుడు పరమేష్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.ఎమ్మిగనూరు ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు న్యాయం జరిగేలా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర కీలకమన్నారు. పోలీసు శాఖకు సమతా సైనిక్ దళ్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎమ్మిగనూరుకు నూతన డీఎస్పీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులకు జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు...
పోలీస్, రెవెన్యూ అధికారుల సమన్వయ సమావేశం

రేణిగుంట అక్టోబర్ :6(రిపబ్లిక్ న్యూస్)



రాబోయే పంచాయతీ మరియు ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో రేణిగుంట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా చూసేందుకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రేణిగుంట ఎంపీడీవో రవిచంద్ర, తహశీల్దార్ శ్రావణ్ కుమార్, రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ రెడ్డితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ మండల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా, అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుంది. పాత నేరస్థులు, ఎన్నికల్లో అలజడులు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచి, చట్ట ప్రకారం ముందస్తు బైండోవర్ చర్యలు చేపడుతున్నాం. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే మద్యం, నగదు అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు, మొబైల్ పెట్రోలింగ్ బృందాలను రంగంలోకి దించుతున్నాం. ఎన్నికల నియమావళిని (కోడ్) ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మరియు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసు యంత్రాంగానికి, అధికారులకు పూర్తి సహకారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

అప్పాజీపేటలో రాళ్ల ఘటనలపై పరిశీలన

పామిడి అక్టోబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)



మండలంలోని అప్పాజీపేట గ్రామంలో గత పది రోజులుగా రాత్రి వేళ ఇళ్లపై, రోడ్లపై రాళ్లు పడుతున్న ఘటనలపై మూఢనమ్మకాల నిర్మూలన సంస్థ రాష్ట్ర కార్యదర్శి గద్దల కళ్యాణ్‌కుమార్, తూర్పుంటి మల్లికార్జున్ బృందంతో కలిసి మంగళవారం గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులను కలిసి ఘటనలపై వివరాలు సేకరించారు.రాత్రి 7 గంటల నుంచి అర్ధరాత్రి 2, 3 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి రాళ్లు వచ్చి పడుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. దీంతో భయాందోళనకు గురై రాత్రివేళల్లో గస్తీ కాస్తున్నా రాళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించలేకపోతున్నామని చెప్పారు. అనంతరం రాళ్లు పడిన ప్రాంతాలను బృంద సభ్యులు పరిశీలించారు.ఈ సందర్భంగా గద్దల కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాళ్లు పడుతున్న ఘటనలపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఇలాంటి ఘటనలు మానవ ప్రమేయంతోనే జరుగుతాయని, అతీంద్రియ శక్తుల ప్రమేయం లేదని తెలిపారు. రాత్రివేళల్లో మాత్రమే మనుషులు విసరగల పరిమాణంలో రాళ్లు పడుతుండటాన్ని గ్రామస్థులు గమనించాలన్నారు. గ్రామంలో భయాందోళనలు తొలగించేలా పోలీసులు సమగ్రంగా విచారణ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మస్తానప్ప, సురేంద్ర, సుధాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తమ సమస్యల మీద ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేసిన ఆశా వర్కర్స్





ఆళ్లగడ్డ అక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో టిడిపి యువ నాయకులు భూమా జగత్ రెడ్డిని కలిసిన సిఐటియు నాయకులు, ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు టిడిపి యువ నాయకులు భూమా జగత్ రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కి తెలుపుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసులు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను, భార్గవ్ రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యత్ రెడ్డిని ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు





ఆళ్లగడ్డ అక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన అమ్మవారి శాల, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఈనెల 11 నుండి జరగబోయే దసరా శరన్నవరాత్రుల వేడుకలకు, ఆళ్లగడ్డఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను,టిడిపి సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్, మరియు టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆహ్వానించడం జరిగింది.

రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో శిక్షణ నిమిత్తం రిపోర్ట్ చేసుకున్న ప్రొబేషనరీ డిప్యూటీ తహశీల్దార్ షేక్ యజ్దాని బాషా....

రేణిగుంట అక్టోబర్ 6: (రిపబ్లిక్ న్యూస్)



తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ప్రొబేషనరీ డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంపికైన షేక్ యజ్దాని బాషా శాంతిభద్రతల నిర్వహణ మరియు పోలీస్ పరిపాలనా వ్యవహారాలపై క్షేత్రస్థాయి అవగాహన నిమిత్తం రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేసుకున్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారు వారం రోజుల పాటు పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించనున్నారు. ఈ సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రక్రియ పోలీస్ – రెవెన్యూ శాఖల సమన్వయం భూవివాదాలు, ఆందోళనల సమయంలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ బాధ్యతలు బందోబస్తు నిర్వహణ, నేర దర్యాప్తు మరియు రికార్డుల నిర్వహణవంటి కీలక అంశాలపై రేణిగుంట పోలీస్ అధికారులు వారికి సమగ్ర శిక్షణ మరియు క్షేత్రస్థాయి అవగాహన కల్పించనున్నారు.ఈ సందర్భంగా స్టేషన్ ఇన్‌స్పెక్టర్/అధికారులు ప్రొబేషనరీ డిప్యూటీ తహశీల్దార్ షేక్ యజ్దాని బాషా స్వాగతం పలికి, శిక్షణ విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.

టీడీపీ నాయకుడు మృతి
నివాళులు అర్పించిన భూమా జగత్ విఖ్యత్ రెడ్డి



ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ తాలూకా సిరివెళ్ల మండలం గుంప్రమాన్ దీన్నే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మాజీ సర్పంచ్, పల్లె మద్దిలేటి రెడ్డి గత రాత్రి గుండెపోటుతో మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అక్కడికి వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ భూమా కుటుంబం టిడిపి ప్రభుత్వం ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది.ం

విజయభాస్కర్‌కు ఛత్రపతి శివాజీ మహారాజ్ పురస్కారం



గుత్తి అక్టోబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)

అనంతపురం జిల్లా గుత్తికి చెందిన చరిత్ర పరిశోధకుడు, గుత్తికోట పరిరక్షణ కార్యకర్త విజయభాస్కర్‌కు ప్రతిష్ఠాత్మక ఛత్రపతి శివాజీ మహారాజ్ పురస్కారం లభించింది. శ్రీశైలంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మారక కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మరాఠా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ దిగ్విజయ్ దివస్ కార్యక్రమంలో రాయగఢ్ శివాజీ స్మారక్ నాయకుడు సుధీర్ తొరట్ చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు.గుత్తికోట చరిత్ర, మరాఠాల ప్రస్థానం, ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు సంబంధించిన చారిత్రక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కోట పరిరక్షణకు విజయభాస్కర్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ మరాఠా సంఘం అధ్యక్షుడు వెంకట్ సోమాజి తెలిపారు. కార్యక్రమంలో విక్రమ్ సిన్హా, ఎన్ఎఫ్ఏ రిటైర్డ్ శాస్త్రవేత్త షీలా, సంఘం నాయకులు, పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది.
ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్.

రైల్వే కోడూరు అక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్.



రైల్వేకోడూరు మండలం ఓబనపల్లి గ్రామంలో నిన్న రాత్రి అకస్మాత్తు కురిసిన భారీ వర్షం కారణంగా నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో దెబ్బతిన్న అరటి తోటలు, పలు పంట పొలాలను రైల్వే కోడూరు జనసేన శాసనసభ్యులు అరవ శ్రీధర్ మంగళవారం పరిశీలించారు, వీచిన పెనుగాలి కురిసిన భారీ వర్షం కారణంగా అధిక మొత్తంలో పంటలు నేలకొరిగి రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చాయని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు,పంటలకు జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే , దెబ్బతిన్న అరటి తోటలు, పంట పొలాలను స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడుతూ నియోజకవర్గం లో ప్రకృతి విపత్తు,వర్షాల కారణంగా పంట నష్టం జరిగిన రైతులు అధైర్యపడవద్దని రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉందని ఎమ్మెల్యే ఆర్య శ్రీధర్ రైతులకు భరోసా ఇచ్చారు, వ్యవసాయ,



సంబంధిత అధికారులకుపంట నష్టం వివరాలను అంచనా వేసి తెలియజేయవలసిందిగా అధికారులను ఆదేశించారు,అధికారుల ద్వారా నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాల కారణంగా నియోజకవర్గంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు,అధికారులు, రైతులు పాల్గొన్నారు,

రొమ్ము క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు
గడ్డ, ఆకృతిలో మార్పులు, అసాధారణ నొప్పి కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 6)



రొమ్ము క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవి శ్యామల సూచించారు.
కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సూపరింటెండెంట్ పర్యవేక్షణలో, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. పద్మావతమ్మ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులు, పారిశుధ్య సిబ్బందికి రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. మాధవి శ్యామల రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన కారణాలు, లక్షణాలు, ముందస్తు గుర్తింపు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
రొమ్ములో గడ్డ ఏర్పడటం, రొమ్ము ఆకృతిలో మార్పులు, అసాధారణమైన నొప్పి వంటి లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని ఆమె సూచించారు. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స మరింత సులభతరమవుతుందని వివరించారు.
అనంతరం నర్సింగ్ విద్యార్థులు, పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి వారు అడిగిన పలు సందేహాలకు వైద్యులు సమాధానాలు అందించారు. మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై పూర్తి అవగాహన పెంచుకుని, అవసరమైన సందర్భాల్లో ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ జయరామ్, నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయులు, నర్సింగ్ విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

సీమంతం.. సంబరంగా

కదిరిలో గర్భిణులకు సామూహిక సీమంతం

పసుపు, కుంకుమ, చీరలు, గాజులతో వేడుకడ -అంగన్వాడీ సిబ్బందికి సత్కారం





కదిరి సంక్షేమం,అక్టోబర్ 06,(రిపబ్లిక్ న్యూస్):
సీమంతం.. సంబరంగా సాగింది. గర్భిణుల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తూ కదిరి నియోజకవర్గంలో సామూహిక సీమంతం నిర్వహించారు. 9వ రాష్ట్రీయ పోషణ మాసం2026, అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతం నిర్వహించి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు అందజేశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సమాజం చూపాల్సిన గౌరవం చాటేలా వేడుక :కదిరి నియోజకవర్గంలో సామూహిక సీమంతం కార్యక్రమాన్ని మూడోసారి నిర్వహించారు. గర్భిణుల పట్ల సమాజం చూపాల్సిన గౌరవం, ఆప్యాయతను చాటేలా వేడుక సాగింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణ, ఆరోగ్య పరిరక్షణలో కీలకంగా పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. వారి సేవలను అభినందించారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరుకావడంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ నుంచి రక్షణకు జర్మన్ టెంట్లు ఏర్పాటు చేసి, తాగునీటిని అందుబాటులో ఉంచారు. గర్భిణులు, మహిళలు, అతిథులు, అంగన్వాడీ సిబ్బందికి ప్రత్యేకంగా భోజన వసతి కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



గుత్తి అక్టోబర్ 06 (రిపబ్లిక్ న్యూస్)
విద్యార్థులకు నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన గుడ్లు అందించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్‌యాదవ్ కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన స్కూల్ బచావో కార్యక్రమంలో భాగంగా గుత్తి మున్సిపాలిటీలోని కోట హైస్కూల్‌లో విద్యార్థులు సమస్యలను డీవైఈవో దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను మెరుగుపరచాలని కోరారు. ప్రతిరోజూ పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీవైఈవో హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కనీస వేతనం అమలు చేయాలి - సీఐటీయూ డిమాండ్





అనంతపురం సంక్షేమం, అక్టోబరు 06,(రిపబ్లిక్ న్యూస్) ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పేర్కొంది . ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతపురంలోని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంలో ఆయన వ్యక్తిగత సహాయకుడు రామచంద్రకు వినతిపత్రం అందజేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కార్యాలయంలో, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి వ్యక్తిగత సహాయకుడికి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల వేతనాలు పెంచి ఏడేళ్లు గడిచినా ఇప్పటివరకు పెంచకపోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆరోగ్యశాఖలో 20 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు అన్ని రకాల సెలవులు అమలు చేయాలని కోరారు. సంబంధం లేని పనులు అప్పగించకుండా పని భారాన్ని తగ్గించాలని, జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్ మృతి చెందితే అంత్యక్రియల ఖర్చులకు రూ.15 వేలు అందించాలని కోరారు. వారి కుటుంబాలకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతోపాటు అర్హులైన కుటుంబ సభ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రాట్యుటీ సీలింగ్‌ను ఎత్తివేయాలని, నాణ్యమైన యూనిఫాం, మొబైల్ ఫోన్లు అందించాలని కోరారు.ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీ.మాలతి, కార్యదర్శి ఎం.నాగమణి, కోశాధికారి భారతి, ప్రమీల, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరమ్మ, గాయత్రి, మల్లిక, సరోజతో పాటు పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ ఆటోలతో చెత్తసేకరణ మరింత పటిష్టం

మూడు నెలల్లో 100 శాతం ఇంటింటి చెత్తసేకరణే లక్ష్యం

కర్నూలులో చెత్తసేకరణపై ప్రజాభిప్రాయంలో 5.6 శాతం మెరుగుదల

రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 6)
కర్నూలు నగరంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగంతో ఇంటింటి చెత్తసేకరణ మరింత పటిష్టమవుతోందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఇంటింటి చెత్తసేకరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో 5.6 శాతం మెరుగుదల నమోదైందని చెప్పారు. వెంకటరమణ కాలనీలో విశాల్ మార్ట్ వెనుక, జొహరాపురం రోడ్డులోని జీటీఎస్ స్టేషన్‌లను నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆయన పరిశీలించారు.
ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ పర్యావరణహితంగా ఇంటింటి చెత్తసేకరణ నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కర్నూలు నగరానికి 91 ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు కాగా, ఇప్పటికే 40 చేరాయని, మిగిలిన ఆటోలు ఈ నెలాఖరులోగా అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. నగరంలో ప్రతిరోజూ సుమారు 225 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కమిషనర్ చల్లా ఓబులేసు ప్రత్యేక చొరవతో జీటీఎస్ స్టేషన్‌ల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.గార్గేయపురం డంప్‌యార్డులో 9.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా రోజుకు 200 మెట్రిక్ టన్నుల చెత్తను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేసి పునర్వినియోగానికి అనువుగా మార్చనున్నట్లు వివరించారు. పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, మరో ఏడాదిన్నరలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు.వచ్చే మూడు నెలల్లో కర్నూలు నగరంలో 100 శాతం ఇంటింటి చెత్తసేకరణ సాధించడమే లక్ష్యమని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ ఇళ్ల వద్దే హోం కంపోస్టింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.
అనంతరం జొహరాపురం డంప్‌యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బయోమైనింగ్ పూర్తయిన స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా స్థానిక ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇంకా మిగిలి ఉన్న 1.18 లక్షల మెట్రిక్ టన్నుల బయోమైనింగ్‌ను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, పబ్లిక్ హెల్త్ ఎంఈ గుర్రప్ప యాదవ్, నగరపాలక సంస్థ ఎంఈ గిరిరాజ్, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన ప్రభుత్వం

సమ్మెలోకి కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు -అత్యవసర సేవలు మినహా వైద్య సేవలు బంద్

ఆస్పత్రుల్లో రిలే నిరాహార దీక్షలు -డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదన్న జేఏసీ





అనంతపురం వైద్యం,అక్టోబర్ 06,(రిపబ్లిక్ న్యూస్)
ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకాకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా కాంట్రాక్ట్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహా మిగిలిన వైద్య సేవలను నిలిపివేశారు. దీంతో ఆస్పత్రులకు వచ్చిన రోగులు, వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గడువు ముగిసినా ఉత్తర్వులు వెలువడలేదు

కాంట్రాక్ట్ నర్సులు, పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ అసిస్టెంట్లు, టెక్నీషియన్లు సహా వందలాది మంది ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తొలుత నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. అనంతరం సమ్మె నోటీసు ఇచ్చి, పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.గతంలో ప్రభుత్వం ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి అక్టోబర్ మూడు వరకు గడువు కోరిందని వారు గుర్తుచేశారు. ఆ గడువు ముగిసినా ఎలాంటి స్పష్టమైన ఉత్తర్వులు వెలువడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీపై నమ్మకంతో ఇన్నాళ్లూ వేచి చూశామని, ఇక చేసేది లేక సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుంది

జేఏసీ జిల్లా చైర్మన్ శరత్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో జరిగిన చర్చల అనంతరం సానుకూల నిర్ణయం వస్తుందని ఆశించామని, అయితే నిరాశే ఎదురైందన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.
నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రధాన సమస్యలపై అధికారులు, మంత్రులు ఫైళ్లు కదపకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలి

జేఏసీ కోచైర్మన్ టి.వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అక్టోబర్ 3 వరకు వేచి చూశామని, గడువు దాటినా జీఓలు విడుదల కాలేదన్నారు. అందుకే ఆస్పత్రుల సేవలను నిలిపివేసి రిలే నిరాహార దీక్షలకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చిన పేద, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా సమ్మెకు దారితీసిన పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు సమ్మె, రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని తేల్చిచెప్పారు.

తాళం వేసిన ఇల్లే టార్గెట్.. 72 గంటల్లో దొంగల ఆటకట్టు!

రూ.20 లక్షల విలువైన 20 తులాల బంగారం స్వాధీనం.. యువకుడితో పాటు మైనర్ బాలుడి అరెస్ట్





కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 6)
తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల ఆటను కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు కట్టించారు. పట్టపగలు జరిగిన భారీ చోరీ కేసును కేవలం మూడు రోజుల్లోనే ఛేదించి, రూ.20 లక్షల విలువైన 20 తులాల బంగారు ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కొడుమూరు రోడ్డులోని సీతారామ వెంచర్‌లో నివాసం ఉంటున్న ఆలివేలు శ్రావణి ఇంట్లో ఈ నెల 3న దుండగులు చొరబడి భారీగా బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసును సవాల్‌గా తీసుకున్న నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ బి.వి. విక్రమ్ సింహా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి



నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్ రహదారిపై వెంకటరమణ పైపంతెన సమీపంలో పల్సర్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులపై పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో బుధవారపేట గౌరీ గోపాల్ ఆసుపత్రి వెనుకనున్న హబీబ్ ముబారక్ నగర్‌కు చెందిన షేక్ ఫైజాస్ (19), మరో 17 ఏళ్ల బాలుడు కలిసి చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుల నుంచి చోరీకి గురైన రూ.20 లక్షల విలువైన 20 తులాల బంగారు ఆభరణాలను నయాపైసా కూడా తగ్గకుండా స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
కేసు నమోదు చేసిన 72 గంటల్లోనే నిందితులను గుర్తించి, చోరీ సొత్తును పూర్తిగా రికవరీ చేసిన సీఐ విక్రమ్ సింహ, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జీనస్, మురళి, సుబ్బారాయుడు, గోవిందు, మధులను, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ అభినందించారు ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

రాప్తాడులో విషాదం

అన్న మృతి, తమ్ముడికి తీవ్ర గాయాలు టీవీ టవర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

-బైక్‌ను ఢీకొట్టి డివైడర్ అవతలికి ఈడ్చుకెళ్లిన ఆర్టీసీ బస్సు





అనంతపురం రూరల్, అక్టోబర్ 06 (రిపబ్లిక్ న్యూస్):
కుటుంబంలో శుభకార్యానికి ఏర్పాట్లు చేసుకుంటున్న వేళ విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో రాప్తాడు ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనలో పెద్దన్న శివ మృతి చెందగా.. తమ్ముడు సదాశివ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం

అనంతపురం నగరంలోని టీవీ టవర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. పుట్టపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు... పుట్టపర్తి నుంచి అనంతపురం వైపు వస్తుండగా.. పెట్రోల్ బంకు సమీపంలో రహదారి దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బైక్‌ను కొంతదూరం డివైడర్ అవతలికి ఈడ్చుకెళ్లడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.రాప్తాడు ప్రాంతానికి చెందిన బోయ కుటుంబానికి చెందిన శివ, సదాశివ అన్నదమ్ములు. శివ కుమార్తెకు బుధవారం మెచ్యూరిటీ ఫంక్షన్ ఉండటంతో కుటుంబ సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విందు కోసం కళాకారుల కాలనీ నుంచి కోళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కుమార్తె వేడుకతో కుటుంబ సభ్యులకు కన్నీళ్లే మిగిలాయి



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు సమాచారం. సదాశివకు కాలు తీవ్రంగా దెబ్బతినడంతో పాటు రక్తస్రావం కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇంట్లో శుభకార్యం జరుపుకోవాల్సిన కుటుంబంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. కుమార్తె వేడుక కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు కన్నీళ్లే మిగిలాయి. ఒకే కుటుంబంలో అన్న మృతి చెందడం.. తమ్ముడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో రాప్తాడులో విషాద వాతావరణం నెలకొంది.శివ, సదాశివ ఇద్దరూ తాపీ మేస్త్రీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని స్థానికులు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శివను కోల్పోవడంతో వారి కుటుంబం ఆర్థికంగా కూడా తీవ్ర ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడింది.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

పాణ్యం నియోజకవర్గంలోని మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు మరియు ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం

నిర్వహించిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి

ఓర్వకల్ ప్రతినిధి, అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్)
ఓర్వకల్లు మండలం, హుస్సేనాపురం గ్రామంలో ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న పాణ్యం నియోజకవర్గంలోని మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలకు వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.
అనంతరం కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.పార్టీ కోసం, ప్రజల కోసం కష్టకాలంలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఘనంగా సన్మానించాలనే ఉద్దేశంతో గ్రామస్థాయిలో నిర్వహించిన సమావేశంలో వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే తమ గ్రామాల్లో అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలని పిలుపునిచ్చారు.అయితే గత మూడు రోజులుగా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ చేయకుండా "సర్వర్ పనిచేయడం లేదు" అంటూ ప్రజలను తిప్పుకుంటున్నారని కాటసాని మండిపడ్డారు. రేపటి నుంచి ప్రతి గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు ప్రజలను సమీకరించి సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేయించి, సర్టిఫికెట్లు అందే వరకు అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కలిసి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలం అయినా ఆ హామీలు ఎందుకు అమలు కావడం లేదు,ప్రజలకు ఇచ్చిన మాటకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉంది" అని కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రశ్నించారు.స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని కాటసాని పిలుపునిచ్చారు.పదవులు పూర్తయినా ప్రజా జీవితంలో మాజీ ప్రజాప్రతినిధుల పాత్ర కొనసాగుతుందని, వైఎస్ఆర్సీపీ కోసం కష్టకాలంలో పనిచేసిన ప్రతి ఒక్కరినీ పార్టీ గౌరవిస్తుందని కాటసాని రామభూపాల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపి రెడ్డి గారు పాణ్యం నియోజకవర్గ మాజీ జెడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కల్లూరు, ఓర్వకల్లు,గడివేముల మరియు పాణ్యం మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వం లక్ష్యం..
పేదల సొంతింటి కల సాకారం.

..రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

..నంద్యాలలో ఘనంగా 233 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి ఫరూక్.

నంద్యాలఅక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్.
రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల మార్కెట్ యార్డులో పేదలకు ఉచిత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా అర్బన్ పరిధిలో 173 మందికి, రూరల్ పరిధిలో 60 మందికి కలిపి మొత్తం 233 మంది అర్హులైన లబ్ధిదారులకు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమేనని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు అనేది ఎంతో కీలకమని, ఆ కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన పేదలకు ఎటువంటి పక్షపాతం లేకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నంద్యాల అర్బన్ పరిధిలో 173 మందికి, రూరల్ పరిధిలో 60 మందికి కలిపి మొత్తం 233 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, ట్రైన్ సబ్ కలెక్టర్ ప్రియాంక, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఎమ్మార్వోలు శ్రీవాణి, శ్రీనివాసులు, ఎంపీడీవో సుగుణ శ్రీ , మాజీ కౌన్సిలర్ మిద్దె ఉసేని , మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి , నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



హుసేనాపురం అభివృద్ధి.. ఒక్కరి ఖాతాలో వేయొద్దు!

గ్రామ ప్రగతికి పలువురి సేవలు.. వారి త్యాగాలను విస్మరించడం సరికాదు: విజయభాస్కర్ యువరాజ్



ఓర్వకల్, అక్టోబర్ 6 (రిపబ్లిక్ న్యూస్):
ఓర్వకల్ మండలంహుసేనాపురం గ్రామ అభివృద్ధి చరిత్రను ఒక్కరి సేవలకే పరిమితం చేయడం సరికాదని వైసీపీ ఎస్సీ సెల్ పాణ్యం నియోజకవర్గం అధ్యక్షుడు విజయభాస్కర్ (యువరాజ్) అన్నారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ప్రజాప్రతినిధుల ఘన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.గ్రామ అభివృద్ధికి గతంలో పలువురు దాతలు, ప్రజాప్రతినిధులు చేసిన సేవలను గుర్తించాలని ఆయన సూచించారు. బెక్కం ఓబుల్‌రెడ్డి, సిద్దం సుంకిరెడ్డి, కైపా రంగపుల్లారెడ్డి, గోప వెంకటరెడ్డి, గువ్వ నాగన్న, గడకారి వెంకటసుబ్బన్న తదితరులు స్మశానం, అంగన్‌వాడీ కేంద్రం, మసీదు, దేవాలయం, సొసైటీ, ఆసుపత్రి వంటి ప్రజా అవసరాల కోసం భూములు, ఆస్తులు విరాళంగా అందించారని తెలిపారు.అభివృద్ధి కోసం కృషి చేసిన వారి సేవలను పక్కనపెట్టి గ్రామ ప్రగతిని ఒక్కరి ఖాతాలో వేయడం న్యాయం కాదని విజయభాస్కర్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సేవలను కూడా ప్రజలు గుర్తించాలని అన్నారు.హుసేనాపురం అభివృద్ధి అనేది ఒక్కరి చరిత్ర కాదని.. తరతరాలుగా సేవలందించిన అనేక మంది కృషి ఫలితమని పేర్కొన్నారు. గ్రామం కోసం సేవ చేసిన ప్రతి ఒక్కరినీ గౌరవించినప్పుడే గ్రామ ఐక్యత మరింత బలపడుతుందని విజయభాస్కర్ యువరాజ్ అన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి - కార్యకర్తలకు చంద్రప్ప సూచన





శింగనమల/నార్పల, అక్టోబర్ 06,(రిపబ్లిక్ న్యూస్) ప్రతి గ్రామంలో బీజేపీని బలోపేతం చేయడంతోపాటు కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని అనంతపురం జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ చంద్రప్ప సూచించారు. నార్పల మండలంలో ఆయన సోమవారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత అంశాలు, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.మండలంలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవంలో చంద్రప్ప పాల్గొన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గర్భిణీలు, తల్లులు, చిన్నారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో భారతి, కేవీకే కోఆర్డినేటర్ సుధారాణి, గర్భిణీలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.అనంతరం నార్పల మండల బీజేపీ కమిటీ సమావేశంలో చంద్రప్ప పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.తదుపరి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్ నివాసానికి చంద్రప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత అంశాలు, జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కడపం దామోదర్, విశ్వనాథ్, రమేష్, నాగేంద్ర, బాలకృష్ణ, ఆకులప్ప, శ్రీధర్, వినోద్, గంగాధర్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి.

రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య.

రైల్వే కోడూరు అక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్.



ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్,ఎన్ శాంతయ్య డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎన్,శాంతయ్య, మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ డిమాండ్స్ ను తక్షణమే పరిష్కరించాలని, , రాష్ట్రంలో, మహిళ నర్సింగ్ సిబ్బంది ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు, వారు గత, 20, సంవత్సరాలనుండి, వైద్య సేవలు ప్రజలకు అందిస్తూ ఉన్నారు, వారిని కూటమి ప్రభుత్వం రెగ్యులర్ చేయకపోవడం చాలా బాధాకరమని , వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు, నూరు శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలన్నారు,

100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మక ఘనత.. చంద్రబాబు హర్షం

, అక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్.ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం, 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలను పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం వారి జీవితాల్లో ఎంతగా భాగమైపోయిందో అర్థమవుతోంది" అని తెలిపారు.చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో శక్తినిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను ఈ పథకం అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా మహిళలు రూ.3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారని, ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వివరించారు.ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేసినందుకు రాష్ట్రంలోని మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, పథకం విజయవంతం కావడంలో అహర్నిశలు కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యానికి, సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.2024 ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీ శక్తి పథకం ముఖ్యమైనది. ఈ పథకాన్ని 2025 ఆగస్టు 15 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

రైతు సందేహానికి.. నేరుగా సమాధానం

రిజోనియా టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌పై రాకెట్ల రైతుల స్పందన -మధ్యవర్తులు లేకుండానే సంస్థతో నేరుగా మాట్లాడే అవకాశం

అనంతపురం సంక్షేమం, అక్టోబర్ 06 (రిపబ్లిక్ న్యూస్):
ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, భూములు, పరిహారం వంటి అంశాలపై రైతులకు సందేహాలు రావడం సహజం. అయితే సమాచారం కోసం ఇతరులపై ఆధారపడకుండా.. సందేహం వచ్చిన వెంటనే సంస్థను నేరుగా సంప్రదించే అవకాశం ఉండటం తమకు ఉపయోగకరంగా ఉందని రాకెట్ల గ్రామ రైతులు చెబుతున్నారు. రిజోనియా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 309 4401 ద్వారా తమకు అవసరమైన సమాచారాన్ని నేరుగా తెలుసుకుంటున్నామని పేర్కొంటున్నారు.భూములు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, పరిహారం తదితర అంశాలపై స్పష్టత కోసం ఎవరిని సంప్రదించాలనే అయోమయం లేకుండా సంస్థ ప్రతినిధులతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించడం సౌకర్యంగా ఉందని రైతులు అంటున్నారు.

సందేహం ... నేరుగా సంస్థను సంప్రదించే అవకాశం

రాకెట్ల రైతు మరెప్ప మాట్లాడుతూ.. ప్రతి విషయానికీ ఇతరులను అడగాల్సిన అవసరం లేకుండా సంస్థను నేరుగా సంప్రదించే అవకాశం రావడం మంచిదన్నారు. తాను కూడా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి అవసరమైన సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు.రైతు ఒబులేసు మాట్లాడుతూ.. హెల్ప్‌లైన్ ద్వారా తమ సందేహాలను నేరుగా అడిగి తెలుసుకోవచ్చన్నారు. అవసరమైన సమయంలో ఎవరిని సంప్రదించాలో స్పష్టత వస్తోందని, రైతులకు సమాచారం నేరుగా అందుబాటులో ఉండటం ఉపయోగకరమన్నారు. ముత్తులూరు రైతు అశోక్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, భూములు, పరిహారం వంటి అంశాలపై సందేహాలు ఉంటే సంస్థ ప్రతినిధులను నేరుగా అడిగి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. తాను కూడా ఫోన్ చేసి అవసరమైన వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు.

టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ప్రత్యక్ష సమాచార వేదిక

రాకెట్ల రైతు రాఘురాములు మాట్లాడుతూ.. రైతులు, సంస్థ మధ్య నేరుగా సమాచార మార్పిడికి హెల్ప్‌లైన్ ఉపయోగ పడుతోందన్నారు. భూములు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, పరిహారం వంటి అంశాలపై సందేహాలు ఉంటే నేరుగా మాట్లాడి తెలుసుకోవచ్చన్నారు.రైతుల స్పందనను బట్టి చూస్తే.. సమాచారం కోసం మధ్యవర్తులపై ఆధారపడకుండా, సందేహం వచ్చినప్పుడు నేరుగా సంస్థను సంప్రదించే అవకాశం తమకు సౌకర్యంగా ఉందని వారు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సరైన సమాచారం తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ప్రత్యక్ష సమాచార వేదికగా ఉపయోగపడుతోందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

34 ఏళ్ల విశిష్ట సేవలకు ఘన సత్కారం

అంగన్వాడీ కార్యకర్తలు, అవార్డు గ్రహీతలను సన్మానించిన టిడిపి నాయకులు



బండి ఆత్మకూరు, అక్టోబర్ 6,(రిపబ్లిక్ న్యూస్):-
బండి ఆత్మకూరు మండలంలో 34 ఏళ్ల నుంచి అంగన్వాడీ కార్యకర్తలుగా విశిష్ట సేవలు అందించిన అంగన్వాడీ కార్యకర్తలను మండల టిడిపి ఇన్చార్జి ముమ్మడి నాగ కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు జాకీర్ ఖాన్ , మహిళా నాయకురాలు లక్ష్మీదేవిలు స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో మండలంలోని బండి ఆత్మకూరు అంగన్వాడి కేంద్రం మూడులో పోషణ మహోత్సవాలు, అంగన్వాడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇటీవల జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకున్న అవార్డు గ్రహీతలు రుక్సన,ముత్యాలమ్మ లతోపాటు గత ఏడాది అవార్డు దక్కించుకున్న రవణమ్మ, శశికళను వారు శాలువలతో ఘనంగా సన్మానించారు. అలాగే 34 ఏళ్లుగా సేవలందిస్తున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు నాగరాజమ్మ, రాజమ్మ, మహేశ్వరమ్మ ,ఆశీర్వాదమ్మ, రిబకమ్మ, తులసమ్మలను కూడ వారు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుదీర్ఘ సేవలు అందించడం సంతోషకరమన్నారు. ఒకవైపు గర్భిణీలు, బాలింతలు మరోవైపు చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు తీసుకువచ్చి వారికి ఆటపాటలతో పాటు వారి ఆలనా.. పాలనా చూసుకోవడం ఎంతో బాధ్యతతో కూడిన పని అన్నారు. వీటితోపాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పరిశుభ్రత చర్యల్లో బండి ఆత్మకూరు మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలకు జిల్లాస్థాయిలో అవార్డు దక్కడం సంతోషకరమన్నారు. జిల్లా స్థాయిలో అవార్డులు దక్కే విధంగా కృషిచేసిన ఐసిడిఎస్ సూపర్వైజర్లు వారు అభినందించారు. ఈ విధమైన సేవలు అందించిన అంగన్వాడీ కార్యకర్తలను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భూపాల్ నాయుడు, పాపయ్య, అంజాద్, కోత్తూరయ్య, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల చెంతకే మెరుగైన వైద్య సేవలు

రాష్ట్రవ్యాప్తంగా 267 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ప్రారంభం.. కర్నూలు జిల్లాలో 27 కేంద్రాలకు శ్రీకారం

ప్రాథమిక వైద్యం, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు ఉచితంగా అందుబాటులోకి







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 6)
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రాథమిక వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి గ్రామాల సమీపంలోనే వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.
రాష్ట్రవ్యాప్తంగా 267 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృష్ణా జిల్లా జనార్ధనపురం నుంచి. వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 27 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రారంభమయ్యాయి. కర్నూలు సునయన ఆడిటోరియం నుంచి ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు నిరంతర ప్రాథమిక ఆరోగ్య సేవలు, వ్యాధుల నివారణ, ఆరోగ్య అవగాహన, వైద్య పరీక్షలు, చికిత్స వంటి సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా 267 కేంద్రాలు ప్రారంభం కావడం ద్వారా ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో 27 కేంద్రాలు ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేస్తూనే, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి గ్రామాల సమీపంలోనే అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.
సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, ఆరోగ్య అవగాహన వంటి సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

12 రకాల వైద్య సేవలు.. 14 రకాల పరీక్షలు

కర్నూలు జిల్లాలో ప్రారంభించిన 27 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు ఉచితంగా అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమీపంలోని కేంద్రాలను సందర్శించి ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు.

27 గ్రామాల్లో కేంద్రాలు

జిల్లాలో యాటకల్లు, ములుగుందం-1, కొత్తకోట-2 (ఈర్లదిన్నె), ఎనగండ్ల, దౌలతపురం, గుమ్మనూరు, పంచాలింగాల-2, ఉల్చాల-2, గొందిపర్ల, ఇంగలదహళ్, శ్రీరంగాపురం, ప్యాలకుర్తి, చిన్నహ్యాట్, హోళగుంద-1, ముసనహళ్లి, మానేకుర్తి, కురుకుంద, తలగోకులపాడు, ఎర్రదొడ్డి, ఉయ్యాలవాడ, ముసగాల, పోలేకల్, రత్నపల్లి, వెల్దుర్తి-1, రామళ్లకోట, రాంపల్లి, పెండకల్ గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రారంభించారు.
అనంతరం ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యాంబాబు, కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి 27 కేంద్రాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ డాక్టర్ జఫ్రాల, డీటీసీవో డాక్టర్ భాస్కర్, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర యాదవ్, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ పి. శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, రామకృష్ణ, జనసేన ఇన్‌చార్జ్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య





పాములపాడు అక్టోబర్-6 రిపబ్లిక్ న్యూస్:-పాములపాడు మండలంలోని, లింగాల లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త.జయసూర్య బటన్ ఆన్ చేసి విడుదల నీటిని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాములపాడు ఎస్సై పి.తిరుపాలు, క్లస్టర్ ఇంచార్జ్ బండ్లమూరి.వెంకటేశ్వర్ రావు, మద్దూరు సొసైటీ చైర్మన్ వాడాల జనార్దన్ రెడ్డి, పాములపాడు సొసైటీ చైర్మన్ సి.గోవిందు కొత్తపల్లి మండల క్లస్టర్ ఇంచార్జ్ నారాపురెడ్డి, ఎదురుపాడు చంద్రశేఖర్ రెడ్డి, లింగాల మాజీ సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు రఘుస్వామి రెడ్డి, పూసల కృష్ణ, రామకృష్ణ, జనార్దన్, ఏర్వ.నాగలక్ష్మి రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం బాష, డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, స్వాములు, రమణారెడ్డి, సిపియం పార్టీ నాయకులు డి.స్వామన్న, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఎ రవీంద్ర, తదితర నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం -పల్లెల్లో అభివృద్ధి జోరు!

లొద్దిపల్లెలో రూ.30 లక్షలు.. ఉయ్యాలవాడలో రూ.2.23 కోట్ల పనులు

ఉప్పలపాడులోనూ అభివృద్ధికి ప్రాధాన్యం.. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి





ఓర్వకల్లు, ప్రతినిధి,అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్)పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.లొద్దిపల్లెలో జల జీవన్ మిషన్-2.0 అమరజీవ జలధార పథకం కింద రూ.30 లక్షలతో నూతన బోరు, పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. ఉయ్యాలవాడలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి టీటీడీ నుంచి రూ.1.03 కోట్లు, సీసీ రోడ్లకు రూ.70 లక్షలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు రూ.30.30 లక్షలు, పల్లె పండుగ-3 సీసీ రోడ్లకు రూ.20 లక్షలు కేటాయించారు. మొత్తం రూ.2.23 కోట్ల పనులు చేపట్టారు.ఉప్పలపాడులోనూ అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, మూడు గ్రామాల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో ఏపీ కార్పొరేషన్ డైరెక్టర్ గంజాయి నాగమని, ఎంపీడీఓ నాగ అనసూయ, స్పెషల్ ఆఫీసర్ సునీల్ కుమార్, మండల అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నాయకులు గోవింద్ రెడ్డి, గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, నన్నూరు సొసైటీ చైర్మన్ నాగేశ్వర రెడ్డి, పరమేశ్వర రెడ్డి, పెద్ద పుల్లారెడ్డి, గిడ్డయ్య, కృష్ణ చౌదరి, బుడ్డ భాష, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ.. ఉద్యోగాల్లో ప్రాధాన్యత

బంగనపల్లి మామిడితో పానీయాల తయారీపై పరిశీలన చేయాలి

నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 6)
పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారికి నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.కృష్ణయ్య పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు.ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేసిన రిలయన్స్ వినియోగదారుల ఉత్పత్తుల సంస్థకు చెందిన పానీయాల తయారీ పరిశ్రమను ఆయన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరితో కలిసి పరిశీలించారు. పరిశ్రమలో కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, స్థానికులకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు, పానీయాల తయారీ విధానం తదితర అంశాలపై పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో సమావేశమై సమీక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ.. మామిడి పానీయాల తయారీలో తోతాపురి, అల్ఫోన్సో రకాలతో పాటు కర్నూలు ప్రాంతంలో విస్తారంగా లభించే బంగనపల్లి మామిడిని కూడా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. స్థానిక రైతుల నుంచి బంగనపల్లి మామిడిని పెద్దఎత్తున కొనుగోలు చేసి, దాని రుచి, నాణ్యతను పరిగణనలోకి తీసుకుని అల్ఫోన్సో మామిడికి ప్రత్యామ్నాయంగా లేదా ఇతర రకాల మామిడితో కలిపి పానీయాల తయారీలో వినియోగించే అంశంపై పరిశోధనలు చేపట్టాలని తెలిపారు.స్థానికంగా విస్తారంగా లభించే మామిడి రకాలకు పరిశ్రమల్లో ప్రాధాన్యత కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, తద్వారా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పానీయాల తయారీ పరిశ్రమల్లో నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా కచ్చితంగా పాటించాలని యాజమాన్య ప్రతినిధులకు సూచించారు.
పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చిన కుటుంబాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చైర్మన్ సూచించారు. నైపుణ్యం అవసరమైన ఉద్యోగాలకు స్థానిక యువత అర్హత సాధించేలా పరిశ్రమ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, శిక్షణ పూర్తిచేసుకున్న స్థానిక యువతను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆదేశించారు.పర్యావరణ అనుమతి నిబంధనల ప్రకారం పరిశ్రమల ప్రాజెక్టు వ్యయంలో కొంత మొత్తాన్ని ప్రభావిత గ్రామాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ నిధులను కేవలం సాధారణ కార్యక్రమాలకు పరిమితం చేయకుండా, ప్రభావిత గ్రామాల వాస్తవ అవసరాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించినప్పుడే కేటాయించిన నిధులకు సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ.. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు స్థానిక యువతలో పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నైపుణ్యం లేకపోవడం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలకు అడ్డంకిగా మారకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు.
అంతకుముందు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పరిశ్రమలో తయారవుతున్న పానీయాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఉత్పత్తుల తయారీలో పాటిస్తున్న నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి సందీప్ కుమార్, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ కిషోర్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, రిలయన్స్ వినియోగదారుల ఉత్పత్తుల సంస్థ పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడీ ఉత్సవాలు

పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





ఆళ్లగడ్డ అక్టోబర్ 6 రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ ఐ సి డి యస్ ప్రాజెక్ట్ ఆఫీస్ నందు ఈ రోజు అంగన్వాడీ ఉత్సవశీ- సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఐ సి డి యస్ సి డి పి ఒ తేజేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25సంవత్సరాలప్రజాసేవను పురస్కరించుకొని సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 7 వరకు అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ముఖ్య అతిధిగా హాజరైనారు.ఈ సందర్భంగాఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పోషణ, మాతృ సంరక్షణ, టీకాలు, శిశువు అభివృద్ధి, మరియు మహిళా సాధికారత లక్షంగా అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయం. గర్భిణులు, బాలింతలు, మరియు పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరికీ చేరువ చేస్తూ ఆళ్లగడ్డ లో అంగన్వాడీ వ్యవస్థనుపటిష్టం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం అంగన్వాడీ పిల్లలు అభినయ గేయాలు ప్రదర్శించినారు. అంగన్వాడీ వర్కర్స్ ఫుడ్ సాల్ట్ , ఫ్రీ స్కూల్ మెటీరియల్ ప్రదర్శించినారు.అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ చేతులమీదుగా అంగన్వాడీ వర్కర్స్ ను హెల్పర్స్ ను సన్మానించారు అనంతరం సి డి పి ఒ తేజేశ్వరి, సూపర్ వైజర్ లు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ లు సుశీల, దస్తగిరమ్మ,ఆళ్లగడ్డ ఐ సి డి యస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

రోడ్డుపై భిక్షాటన చేస్తున్న చిన్నారులను చేరదీసిన జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్....

-"చదువుకుంటారా.. చదివిస్తా" అంటూ ఆప్యాయంగా పలకరింపు,...

రాయికల్ మండలం

అక్టోబర్,06 (రిపబ్లిక్ న్యూస్)

చేతుల్లో పుస్తకాలు పట్టుకుని బడికి వెళ్లాల్సిన చిన్నారులు.. బిక్షాపాత్రలు పట్టుకుని రోడ్డుపై నిల్చున్న దృశ్యం జగిత్యాల పట్టణంలో కలచివేసింది. ఎండను సైతం లెక్కచేయకుండా తల్లిదండ్రులతో కలిసి భిక్షాటన చేస్తున్న నాలుగైదేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులను చూసిన జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ చలించిపోయారు. విధులకు వెళ్తున్న సమయంలో తహసీల్ చౌరస్తా వద్ద ఈ దృశ్యం ఆయన దృష్టికి రావడంతో వెంటనే వాహనాన్ని ఆపి చిన్నారుల వద్దకు వెళ్లారు. చిన్నారులను ఆప్యాయంగా చేరదీసిన సీఐ కరుణాకర్ వారితో కొద్దిసేపు మాట్లాడారు. "చదువుకుంటారా.. మిమ్మల్ని చదివిస్తా" అంటూ వారిలో భరోసా నింపారు. పోలీసు అధికారి వెంట వస్తామని చిన్నారులు చెప్పడంతో వారిని ఆటోలో ఎక్కించి సురక్షితంగా తరలించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించి, చిన్నారుల సంక్షేమం, విద్య, భద్రతకు సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టేలా చర్యలు ప్రారంభించారు. సాధారణంగా విధుల్లో భాగంగా వెళ్లిపోకుండా, చిన్నారుల పరిస్థితిని గమనించి వెంటనే స్పందించిన సీఐ కరుణాకర్ చొరవ అభినందనీయం. పోలీసు విధుల్లో నేర నియంత్రణతో పాటు సమాజంలోని బలహీన వర్గాలు, ముఖ్యంగా చిన్నారుల భద్రత, సంక్షేమంపై కూడా పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటి చెప్పింది.



తల్లి ఆరోగ్యమే.. బిడ్డ భవిష్యత్తుకు బలమైన పునాది!

గర్భిణీలు, కిశోర బాలికలకు పోషకాహారంపరిశుభ్రతపై అవగాహన

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)



గర్భిణీలు, కిశోర బాలికలు పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని అధికారులు సూచించారు. జోగిపేట సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం ఆధ్వర్యంలో ఆందోల్‌జోగిపేట మున్సిపాలిటీ 16వ వార్డులోని స్థానిక అవుసలి సంఘంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గర్భిణీలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు విపులంగా అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను చేర్చుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు.ముఖ్యంగా గర్భిణీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వివరించారు. కిశోర బాలికలు కూడా పోషకాహారంపై అవగాహన పెంపొందించుకుని ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ఆందోల్‌జోగిపేట మున్సిపల్ చైర్మన్ శ్రీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), స్థానిక 16వ వార్డు కౌన్సిలర్ శ్రీ పట్లోళ్ల శ్రీనివాస్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి లలితకుమారి, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం ప్రాజెక్టు అధికారి శ్రీమతి మధులత, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పట్టణ మిషన్ సమన్వయకర్త శ్రీ భిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.అలాగే ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ ఉపాధ్యాయులు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ వనరుల వ్యక్తులు, గర్భిణీలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్ గా మారాలి

- కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి



గోనెగండ్ల అక్టోబర్ 06(రిపబ్లిక్ న్యూస్)



గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి పిలుపునిచ్చారు.మంగళవారం గోనెగండ్ల మండలంలోని హెచ్ కైరవాడి గ్రామంలో నిర్వహించిన "చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్" అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని, విద్యను దెబ్బతీస్తాయన్నారు. 18 ఏళ్లు నిండని అమ్మాయికి, 21 ఏళ్లు నిండని అబ్బాయికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, ఇది బాల్యవివాహ నిరోధక చట్టం – 2006 కింద అమ్మాయి తల్లిదండ్రులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష దీంతో పాటు లక్ష రూపాయల జరిమానము బాల్య వివాహానికి హాజరైన వారు పెళ్లి నిర్వహణ మద్దతుదారులు కళ్యాణమండపం వారు టెంట్ హౌస్ వారు వంట మనుషులు ఫోటోగ్రాఫర్స్ వీరందరూ శిక్షార్హమని తెలిపారు.ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను, ముఖ్యంగా ఆడపిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలే తప్ప, చిన్న వయసులోనే పెళ్లి చేసి భారంగా భావించకూడదని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహం జరిగే పరిస్థితి ఉంటే వెంటనే 1098 చైల్డ్ లైన్ నంబర్ కు లేదా ప్రభుత్వ అధికారులకు మరియు పంచాయతీ కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఐసిడిఎస్ రంగమ్మ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కే విమల సూపర్వైజర్ ఎం శ్రావణి మహిళా పోలీస్ డాక్టర్ బి.ఆర్ రవళి ఏ సుగుణమ్మ ఏఎన్ఎం బి విజయలక్ష్మి ఏఎన్ఎం ఎస్ చందు డబ్ల్యూఏ అంగన్వాడీ టీచర్స్ ఆశ వర్కర్స్ గ్రామ పెద్దలు, యువత అందరూ కలిసి తమ గ్రామాన్ని "బాల్యవివాహ రహిత గ్రామం" గా ప్రకటించుకునేలా తీర్మానం చేయాలని ప్రతిజ్ఞ చేసి పిలుపునిచ్చారు. బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు బజారు స్టాల్స్ రెన్యువల్ చేయాలి

కర్నూలుకలెక్టర్‌కు డ్వాక్రా మహిళలు, వ్యాపారుల వినతి

కర్నూలు ప్రతినిధి: అక్టోబర్ 6(రిపబ్లిక్ న్యూస్).



కర్నూలు నగరంలోని సి. క్యాంప్ రైతు బజారులో కూరగాయల వ్యాపారం చేస్తున్న డ్వాక్రా మహిళలు, వ్యాపారుల స్టాల్స్ అనుమతులను రెన్యువల్ చేసి తమ జీవనోపాధిని కాపాడాలని కోరారు. టీడీపీ బి. క్యాంప్ 22వ వార్డు, శ్రీరామనగర్ 23వ వార్డు, లక్ష్మీనగర్ 24వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి వినతిపత్రం అందజేశారు.సి. క్యాంప్ రైతు బజారులో 26 పొదుపు సంఘాలకు చెందిన మహిళలు ఎన్నో సంవత్సరాలుగా కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కేటాయించిన స్టాల్స్ అనుమతులు చాలా కాలంగా రెన్యువల్ కాలేదని, ఇటీవల రెన్యువల్ చేయించుకోవాలని నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. తమ స్టాల్స్ తొలగించకుండా అనుమతులు రెన్యువల్ చేసి, కేటాయించిన దుకాణాల్లోనే వ్యాపారం కొనసాగించే అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతు బజారు వ్యాపారుల సమస్యలను గతంలో మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు తెలిపారు. ప్రస్తుతం



కూడా మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో పాటు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు. అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా స్టాల్స్ రెన్యువల్ చేయాలని కోరారు.మంత్రి టీజీ భరత్, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ తమకు అండగా నిలిచి సమస్యను పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని రైతు బజారు వ్యాపారులు తెలిపారు.

కలబంద తాంత్రిక పరిహారం.....!!

ఈ చెట్టు ని అందరూ వాస్తు పరిహారం అనే పేరుతే పెంచుతున్నారు కానీ...

--ఇది తాంత్రిక పరిహారంగా కూడా ఉపయోగపడుతుంది అని తెలిపిన సనాతన ధర్మ పరిరక్షకుడు ఆడెపు రాజమౌళి

రాయికల్ మండలం అక్టోబర్ 06(రిపబ్లిక్ న్యూస్)





కలబంద తాంత్రిక పరిహారం.....!!

ఈ చెట్టు ని అందరూ వాస్తు పరిహారం అనే పేరుతే పెంచుతున్నారు కానీ ఇది తాంత్రిక పరిహారంగా కూడా ఉపయోగపడుతుంది అని సామాజికవేత్త ఆధ్యాత్మిక వ్యక్తిగా దైవచింతన గల దైవరాధకుడిగా సనాత ధర్మ పరిరక్షకుడూ ఆడెపు రాజమౌళి తెలిపారు

అది ఎలా అంటే ఈ చెట్టు లో జీలకర్ర నీళ్లు సోమవారం రోజు పోయాలి (ఒక గ్లాసు నీళ్ళలో ఒక స్పూన్ జీలకర్ర వేసి నానబెట్టాలి ఆ నీటిని వడపోసి పోయాలి) అలా చేయడం వల్ల చంద్రుడు వల్ల ఏర్పడే బాధలు తగ్గుతుంది. బెల్లం కలిపిన నీళ్ళు ని మంగళవారం రోజు కలబందలో పోయాలి(ఒక గ్లాసు నీళ్ళలో ఒక చిన్న బెల్లం ముక్క వేసి కలిపి పోయాలి) అలా పోయడం వల్ల అంగారకుడి వల్ల ఏర్పడే బాధలు తగ్గుతాయి. బుధవారం రోజు తేనె కలిపిన నీటిని కలబంద చెట్టు లో పోస్తే బుధ గ్రహం వల్ల ఏర్పడే దోషాలు తొలగిపోతాయి.(ఒక గ్లాసు నీళ్ళలో ఒక స్పూను తేనె కలిపిన నీళ్లను పోయాలి). ఇలా కలబంద చెట్టులో పోసె నీళ్ళ వల్ల కూడా తాంత్రిక పరిహారం చేసుకోవచ్చు. కానీ ఈ పరిహారం ఈ మూడు రోజులు తప్ప వేరే రోజు ఫలించదు.కలబందని ఇంటి ముందు పెట్టడం వల్ల నెగటివ్ ఎనర్జీ మీ ఇంటి లోపలికి రాకుండా చూసుకుంటుంది దిష్టి పరిహారం గా కూడా పనిచేస్తుంది

ఈ చెట్టుని ఇంటి ముందర భాగం లోనే కాకుండా ఇంటి వెనుక భాగం లో కూడా ఉంచుకోవచ్చు. ఇలా ఉంచుకోవడం వల్ల నేగటివ్ వైబ్రేషన్ రాకుండా ఉంచ గలుగుతుందిమీకు తెలిసే ఉంటుంది కలబంద లో ఉండే జెల్ క్యాన్సర్ జబ్బును కూడా నయం చేయగలదు అలాగే ఫేస్ జెల్గా కూడా పనిచేస్తుంది సనాతన ధర్మ పరిరక్షకుడు ఆడెపు రాజమలి తెలిపారు

మునగాల గ్రామం బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఏకగ్రీవ తీర్మానం





గూడూరు, అక్టోబర్ 06(రిపబ్లిక్ న్యూస్) : కర్నూలు జిల్లా గూడూరు మండలంలోని మునగాల గ్రామాన్ని "బాల్యవివాహ రహిత గ్రామం"గా తీర్చిదిద్దేందుకు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు.మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ఆధ్వర్యంలో మునగాల గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామస్థులు సంపూర్ణ సహకారం అందించాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా DCPU సామాజిక కార్యకర్త ఎన్. నరసింహులు మాట్లాడుతూ బాల్యవివాహం ఒక సామాజిక దురాచారమని, దీనికి శాశ్వతంగా స్వస్తి పలకాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే బాల్యవివాహ రహిత గ్రామం తీర్మానం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై తల్లిదండ్రులు, ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని, బాలికలు తమ విద్యను కొనసాగించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.DCPU కౌన్సిలర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు జరపడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. బాలికకు 18 సంవత్సరాలు, బాలుడికి 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాతనే వివాహం జరిపించాలని సూచించారు. ఇకపై గ్రామంలో బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామస్థులందరూ కలిసి మునగాల గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేశారు బాలికల విద్యను ప్రోత్సహిస్తూ, బాల్యవివాహాలను అరికట్టేందుకు గ్రామస్థులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ అధికారి సుదర్శన్ మహిళా పోలీస్ సిబ్బంది, DCHL 1098 సిబ్బంది మారెన్న, అంగన్వాడీ కార్యకర్తలు నాగేంద్రమ్మ, వెంకటేశ్వరమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ ఉద్యోగులకు 5 రోజుల పని డిమాండ్‌కు కవిత మద్దతు

వారానికి 5 రోజులే పని.. బ్యాంక్ ఉద్యోగుల కోసం కవిత కీలక సూచన

బ్యాంకుల్లో షిఫ్ట్ విధానం పెట్టండి.. కేంద్రానికి విజ్ఞప్తి బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్ న్యాయమైనదేనని వ్యాఖ్య బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని, లేదంటే షిఫ్ట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పనిభారం పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులు చేస్తున్న ఈ డిమాండ్ న్యాయమైనదని ఆమె అభిప్రాయపడ్డారు.

"బ్యాంకులు తెరిచినప్పటి నుంచి ఉద్యోగులు నిరంతర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. కస్టమర్లను చూసుకోవడం, బ్యాక్-ఎండ్ పనులు, టార్గెట్లు, నగదు సర్దుబాటు వంటి పనులతో సతమతమవుతున్నారు. పని గంటలు ముగిసిన తర్వాత కూడా రాత్రి 9, 10 గంటల వరకు పనిచేస్తున్నారు" అని తెలిపారు. గత దశాబ్దంలో డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు పెరిగినప్పటికీ, ఉద్యోగులపై పనిభారం ఏమాత్రం తగ్గలేదని ఆమె పేర్కొన్నారు. శనివారాలు



పూర్తిగా సెలవులు ఇవ్వడం కష్టమైతే, బ్యాంకులను ఏదు రోజులూ తెరిచి ఉద్యోగులకు షిఫ్ట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

కాగా, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (ఖఖీదీఖ) చాలా కాలంగా వారానికి ఐదు రోజుల పని కోసం పోరాటం చేస్తోంది. ప్రస్తుతం బ్యాంకులకు రెండవ, నాల్గవ శనివారాలు మాత్రమే సెలవులు ఉన్నాయి. ఈ డిమాండ్‌పై ఇటీవల సమ్మెకు పిలుపునివ్వగా, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (xదూూ) చర్చలకు అంగీకరించింది. ఈ అంశాన్ని పరిశీలించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడంతో యూనియన్లు సమ్మెను వాయిదా వేశాయి.అయితే, 2024 మార్చిలో జరిగిన వేతన ఒప్పందంలో ఐదు రోజుల పని విధానానికి ప్రభుత్వం అధికారికంగా అంగీకరించలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు గతంలోనే స్పష్టం చేశాయి. ప్రస్తుతం ఆర్‌బీఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, బీమా సంస్థల్లో ఇప్పటికే ఐదు రోజుల పని విధానం అమలవుతోంది. కమిటీ సిఫారసుల అనంతరం ఈ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

అక్టోబర్ 7న నంద్యాల కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా

అర్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల బ్యూరో, అక్టోబర్ 06 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా స్వర్ణ గ్రామం–స్వర్ణ వార్డు విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 7వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నంద్యాల కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో అపోలో టైర్స్ లిమిటెడ్ (ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్), టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలకు సంబంధించిన ఉద్యోగాల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అపోలో టైర్స్‌లో డిప్లొమా, ఐటీఐ (ఎన్‌సీవీటీ తప్పనిసరి), డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అవకాశాలు ఉండగా, అభ్యర్థుల వయస్సు 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. శారీరక ప్రమాణాల్లో కనీసం 163 సెం.మీ. ఎత్తు, 50 కిలోల బరువు ఉండాలని సూచించారు. అదేవిధంగా టాటా ఎలక్ట్రానిక్స్‌లో మొబైల్ అసెంబ్లీ విభాగంలో అసోసియేట్ ఉద్యోగాలకు 10వ తరగతి, 12వ తరగతి, డిప్లొమా, ఐటీఐ లేదా ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు కలిగిన వారు హాజరుకావచ్చని కలెక్టర్ తెలిపారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రెజ్యూమ్/సీవీ, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత ముందస్తుగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

ఉద్యోగుల క్రమశిక్షణా కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

పెండింగ్ కేసులకు 15 రోజుల్లోగా తార్కిక ముగింపు ఇవ్వాలి

క్రమశిక్షణా కేసులపై ప్రతి నెలా మొదటి వారంలో సమీక్ష నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, అక్టోబరు 06 (రిపబ్లిక్ న్యూస్)
ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణా కేసులను నిర్దేశిత గడువులోగా విచారించి, ప్రతి కేసుకు తార్కిక ముగింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. క్రమశిక్షణా కేసుల్లో అనవసర జాప్యం లేకుండా విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ కేసులను 15 రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యోగుల క్రమశిక్షణా కేసులపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, కలెక్టరేట్ ఏఓ డి. సుభాకర్ రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.91, 77, 177 ఆదేశాల మేరకు ఉద్యోగుల క్రమశిక్షణా కేసులపై ప్రతి నెల మొదటి వారంలో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి దశలో నిర్దేశిత ప్రక్రియను పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రమశిక్షణా కేసుల్లో పెండెన్సీకి ప్రధానంగా ఐదు దశలు కారణమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అభియోగాలు నమోదు చేసినప్పటికీ ఉద్యోగి నుంచి వివరణ రాకపోవడం, వివరణ స్వీకరించినా విచారణాధికారిని నియమించకపోవడం, విచారణాధికారిని నియమించినప్పటికీ విచారణ నివేదిక సమర్పించకపోవడం, విచారణ నివేదిక సమర్పించినా క్రమశిక్షణాధికారి తదుపరి చర్యలు చేపట్టకపోవడం, తుది నిర్ణయం తీసుకోకుండా కేసు పెండింగ్‌లో ఉండటం వంటి కారణాలతో కేసులు జాప్యానికి గురవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి కేసు ఏ దశలో పెండింగ్‌లో ఉందో గుర్తించి, సంబంధిత అధికారి బాధ్యత తీసుకుని తదుపరి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే అభియోగాలు నమోదు చేసి, విచారణాధికారి నివేదిక సమర్పించిన కేసుల్లో తగిన తుది నిర్ణయం తీసుకుని కేసులకు లాజికల్ కంక్లూజన్ ఇవ్వాలని ఆదేశించారు.0అవినీతి సంబంధిత కేసులను ఏడాదిలోపు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని, శాఖాపరమైన చర్యలకు గురైన ఉద్యోగుల కేసుల్లో ఆరు నెలల్లోగా విచారణ ప్రక్రియను పూర్తి చేసి, నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలుకు సంబంధించిన గడువు నేపథ్యంలో సంబంధిత కేసులు మరింత ఆలస్యమయ్యే అవకాశం లేకుండా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని క్రమశిక్షణా కేసుల వివరాలను, ఆయా కేసులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పెండింగ్ కేసులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

విద్యా రంగంలో జిల్లాను ముందంజలో నిలపాలి

మనబడి,నాడు నేడు, పీఎంసిరి పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతుల నిర్మాణ పనులను నాణ్యత తో పూర్తి చేయాలి

జిల్లాలో పదవ తరగతి ఫలితాల మెరుగుదలకు మిషన్ మార్చి -2027 పక్కగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



నంద్యాల బ్యూరో, అక్టోబర్ 06 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లాలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ పనితీరు, విద్యా కార్యక్రమాల అమలు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పదో తరగతి ఫలితాల మెరుగుదల, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు (సీడబ్ల్యూఎస్ఎన్) ఎన్‌రోల్‌మెంట్, స్కిల్ డెవలప్మెంట్ తదితర అంశాలపై పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిగా జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.సమీక్ష అనంతరం జిల్లాలో విద్యా రంగానికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు, పాఠశాలల మౌలిక వసతుల కల్పన, నిధుల వ్యయం, విద్యార్థుల ప్రవేశాలు, బడి బయట పిల్లలు, విద్యార్థుల హాజరు, డ్రాపౌట్లపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షిస్తూ.. మనబడి, నాడు నేడు, పీఎం శ్రీ పాఠశాలల నిర్మాణ, మౌలిక వసతుల పనులతో పాటు ఆడిటోరియం నిర్మాణాలను కూడా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం సకాలంలో ఖర్చు చేసి, పనుల పురోగతికి అనుగుణంగా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. నిధుల వినియోగం సక్రమంగా జరిగితేనే కేంద్ర ప్రభుత్వం నుంచి తదుపరి విడత నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. పనుల వాస్తవ పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతుల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించి, సమస్యలను అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో పదవ తరగతి ఫలితాల మెరుగుదలకు మిషన్ మార్చి -2027 పక్కగా అమలు అమలు అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల గైర్హాజరు మరియు డ్రాపౌట్లకు గల కారణాలను గుర్తించి వాటిని నివారించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని తెలిపారు. బడి బయట పిల్లలు పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖకు సంబంధించిన ప్రాధాన్యతా కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేసేందుకు వివిధ విభాగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలన్నారు. విద్యాశాఖకు సంబంధించిన అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా స్కిల్ హబ్ లో శిక్షణ కార్యక్రమాలు నిరంతరం జరుగుతూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, వయోజన విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సమగ్ర శిక్ష అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సోమ శివారెడ్డి, ఆర్ ఏ ఓ శంకర్ నాయక్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ శశికళ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

రూ.50,000/- జరిమానా



నంద్యాల క్రైం, అక్టోబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):
పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.50,000/– జరిమానా కేసులో నిందితుడు అయిన శివుడుకి మంగళవారం నంద్యాల జిల్లా న్యాయస్థానం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50,000/– జరిమానా విధించింది. వివరాల్లోకి వెళ్తే 10 సంవత్సరాల వయస్సు గల బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా, నిందితుడు బాలికకు డబ్బు ఆశ చూపి ఊరి బయట ఉన్న కల్లం వద్ద గడ్డి వాము దాపుకు తీసుకెళ్లాడు. అక్కడ బాలిక బట్టలు విప్పితే రూ.50/– ఇస్తానని చెప్పి, బలవంతంగా బాలిక బట్టలు విప్పేందుకు ప్రయత్నించాడు. నిందితుడి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని తన తల్లికి తెలిపింది. అనంతరం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందివర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తును అప్పటి నందివర్గం ఎస్సై రామాంజనేయ రెడ్డి సమర్థవంతంగా నిర్వహించారు. ఎఫ్.ఐఆర్. నమోదు నుంచి సాక్షుల స్టేట్‌మెంట్ల నమోదు, అవసరమైన ఆధారాల సేకరణ, దర్యాప్తు పూర్తి చేసి పకడ్బందీగా చార్జిషీట్ దాఖలు చేయడం వరకు సమగ్రంగా చర్యలు చేపట్టారు. కేసు కోర్టు విచారణ దశలో ప్రస్తుత నందివర్గం ఎస్సై భూపాలుడు సాక్షులను నిర్ణీత సమయానికి గౌరవ న్యాయస్థానానికి హాజరుపరచడంతో పాటు, బాధిత కుటుంబానికి అవసరమైన సహకారం అందించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాస్, బనగానపల్లె రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ రెడ్డి కేసును నిరంతరం పర్యవేక్షిస్తూ, దర్యాప్తులో ఎలాంటి లోపాలు లేకుండా తగిన మార్గనిర్దేశం చేశారు.అదేవిధంగా, కోర్ట్ కానిస్టేబుల్ బాలరాజు, కోర్టు మానిటరింగ్ డబ్ల్యూ.పి.సి శారద సాక్షులకు సమన్లు అందించడం, వారిని సమయానికి కోర్టుకు హాజరుపరచడం, కోర్టు, పోలీస్ స్టేషన్ మధ్య సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ చిన్నారులపై జరిగే లైంగిక నేరాల పట్ల నంద్యాల జిల్లా పోలీస్ శాఖ జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరిస్తోందని తెలిపారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో దర్యాప్తును అత్యంత సున్నితంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. చిన్నారులపై నేరాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి చట్టం ప్రకారం శిక్ష పడేలా నంద్యాల జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ స్పష్టం చేశారు.

మున్సిపల్, పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి

ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, ఎన్నికల సామగ్రిపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, అక్టోబరు 06 (రిపబ్లిక్ న్యూస్)
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మున్సిపల్, పంచాయతీ, జిల్లా పరిషత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ రాము నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిపిఓ ఫణికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ) ఎన్నికలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పన, పోలింగ్ సిబ్బంది గుర్తింపు, శిక్షణ, ఎన్నికల సామగ్రి సమీకరణ, స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్‌రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, ఇతర అవసరమైన పరికరాల లభ్యతను ముందుగానే నిర్ధారించుకుని, వాటి భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, శాంతియుత వాతావరణం ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నుంచి వెలువడే ప్రతి మార్గదర్శకం, షెడ్యూల్‌ను ఖచ్చితంగా పాటిస్తూ, నిర్దేశిత గడువుల్లో ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏపీలో రూ.6,700 కోట్ల పెట్టుబడులకు శ్రీ సిమెంట్స్ ఆసక్తి

కడప, పల్నాడు, అనకాపల్లిలో పెట్టుబడులకు ప్రతిపాదనలు..

3 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

మంత్రి టీజీ భరత్‌తో కంపెనీ ప్రతినిధుల భేటీ



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 6)
ఆంధ్రప్రదేశ్‌లో తమ పెట్టుబడులను మరింత విస్తరించేందుకు శ్రీ సిమెంట్స్ లిమిటెడ్ ఆసక్తి చూపుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. విశాఖపట్నంలో మంత్రి టీజీ భరత్‌ను శ్రీ సిమెంట్స్ కంపెనీ ప్రతినిధులు కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల విస్తరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు రాష్ట్రంలో సుమారు రూ.6,700 కోట్ల పెట్టుబడులతో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు మంత్రికి వివరించారు. ముఖ్యంగా కడప, పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ప్రతిపాదనలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.
ప్రతిపాదిత పెట్టుబడులు కార్యరూపం దాల్చితే సుమారు 3 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి టీజీ భరత్ తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు.
శ్రీ సిమెంట్స్ ప్రతిపాదిత పెట్టుబడులు రాష్ట్ర పారిశ్రామిక రంగ అభివృద్ధికి దోహదపడటంతో పాటు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం కల్పిస్తాయని మంత్రి పేర్కొన్నారు.
మంత్రి టీజీ భరత్‌ను కలిసిన శ్రీ సిమెంట్స్ ప్రతినిధుల్లో వైస్ చైర్మన్ ప్రశాంత్ బాబు, ప్రెసిడెంట్ కార్పొరేట్ అఫైర్స్ గౌరవ్ జైన్ ఉన్నారు.

“రిఫార్మ్ ఉత్సవ్” వాయిదా

నిర్వహణ తేదీ మళ్లీ ప్రకటిస్తాం

మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



విజయవాడ, అక్టోబరు 06(రిపబ్లిక్ న్యూస్) :
కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ‘నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ ఆ ఫైనాన్స్ కార్పొరేషన్’ (ఎన్.ఎం.డి.ఎఫ్.సి) ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన విజయవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలపై విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో తలపెట్టిన “రిఫార్మ్ ఉత్సవ్” కార్యక్రమం అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా వాయిదా పడినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన రాష్ట్రవ్యాప్త మైనారిటీ నోడల్ అధికారులు, నియోజకవర్గ యువతీ యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులందరూ ఈ మార్పును గమనించి, సానుకూలంగా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి ఫరూక్ విజ్ఞప్తి చేశారు. రిఫార్మ్ ఉత్సవ్ కు సంబంధించిన తదుపరి నిర్వహణ తేదీ, వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ వాయిదా వల్ల కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com